క్లుప్తంగా

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



నారుమడిని పరిశీలిస్తున్న ఏఓ రామకృష్ణ

మద్దూరు(హుస్నాబాద్): శీతాకాలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న కారణంగా వరి నారు కోసం సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ రామకృష్ణ తెలిపారు. గురువారం మండల పరిధిలోని లద్నూరులో నారుమడులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పగటి పూట నీరు పెట్టి రాత్రి సమయంలో నారు మడి నుంచి నీటిని తీసివేయాలన్నారు. ఆయనతో పాటు ఏఈఓ అఖిల్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 220/132 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట డివిజనల్ ఇంజనీర్ మహేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట మున్సిపాలిటీ, సిద్దిపేట అర్బన్ మండలం, సిద్దిపేట రూరల్ మండలం, నారాయణరావుపేట మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు విద్యార్థులకు పలు కార్యక్రమాలు దోహద పడతాయని స్థానిక సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ బాబు అన్నారు. గురువారం పాఠశాలలో మోడల్ యునైటెడ్ నేషన్, యూత్ పార్లమెంట్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని పలు గురుకుల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి, కామర్స్ లెక్చరర్ రవి, విద్యార్థులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న తపాల ఉద్యోగుల సమ్మె

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తపాల ఉద్యోగులు చేపట్టిన సమ్మె మూడో రోజుకు చేరుకుంది. గురువారం మండల కేంద్రంలో తపాల ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తన న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తపాల ఉద్యోగులు నర్సింలు, పరశురామయ్య, తిమ్మయ్య, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు ఆపాలని వినతి

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని ముబారస్‌పూర్ స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని మల్లేశంపల్లి, శౌరీపూర్ గ్రామాల సర్పంచ్ దార సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గజ్వేల్- ప్రజ్ఞాపూర్ డిపో ప్రతినిధికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైమద్‌నగర్ స్టేజీ వద్దనే బస్సులు అపి, ముబారస్‌పూర్ వద్ద బస్టాండ్ ఉన్నా బస్సులు ఆపడం లేదన్నారు. దీంతో మల్లేశంపల్లి, శౌరీపూర్ ముబారస్‌పూర్, సూరంపల్లి, తదితర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి బస్సులు అపే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

‘భట్టి’ని కలిసిన కొమ్మెర



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటరెడ్డి

గజ్వేల్: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను గురువారం హైదరాబాద్‌లో గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొమ్మెర వెంకటరెడ్డి కలిశారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

జాయింట్ చెక్‌పవర్ తొలగించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అరుణాదేవి



ఆవేదన వ్యక్తం చేస్తున్న సర్పంచ్ రమేశ్

- నంగునూరు మండల సమావేశంలో సర్పంచ్‌ల డిమాండ్

నంగునూరు(సిద్దిపేట): కొత్తగా ఎన్నికయ్యే సర్పంచ్‌లు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే ఉపసర్పంచ్‌లకు జాయింట్ చెక్‌పవర్ రద్దు చేయాలని సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. ఎంపీపీ జాప అరుణాదేవి అధ్యక్షతన గురువారం నంగునూరు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మండల ఉపాధ్యక్షుడు తిప్పని రమేశ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన చెక్కులపై ఉప సర్పంచ్‌లు సంతకం పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. తమ పదవీకాలం ముగుస్తున్నందున పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పినా.. అమలుకు నోచుకోవడం లేదని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎంఈఓ దేశిరెడ్డి నంగునూరు మండలంలో 18 పాఠశాలలు ఎంపిక చేయగా.. రెండు పాఠశాలల్లో మాత్రమే ప్రారంభమయ్యాయని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం సరఫరా తగ్గినందున సెంటర్లను ఎత్తివేసే అవకాశం ఉందని, రైతులు వెంటనే ధాన్యం అమ్ముకోవాలని ఏపీఎం ఆంజనేయులు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉమ, వైస్ ఎంపీపీ రేణుక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కచ్చు రాజయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు శ్రీనివాస్‌గుప్త, లక్ష్మణ్, తిరుపతి, శేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



హరీశ్‌రావుతో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, నాయకులు

నిరుపేదలకు కల్యాణలక్ష్మి వరం



చెక్కులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు గొప్ప వరమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఎంతో మంది మహిళలు లబ్ధిపొందుతున్నారని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు కొంకట నళినిదేవి, చిత్తారి పద్మ, సరోజన, దొడ్డి శ్రీనివాస్, హరీశ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కో ఆప్షన్ సభ్యుడు అయూబ్, ఆర్‌ఐ రాజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి నుంచి కొత్త ఓటరు నమోదు

- ఆర్డీఓ బెన్ షాలెమ్
- ఐవోసీలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

హుస్నాబాద్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి కొత్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆర్డీఓ బెన్ షాలెమ్ తెలిపారు. గురువారం ఐఓసీ బిల్డింగ్‌లో నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లు, అలాగే త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలపై చర్చించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌లు లేని గ్రామాలకు వాహన సౌకర్యం ఏర్పాటు చేస్తామని చెప్పి కల్పించలేదని ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యంతో చాలా మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోలేదన్నారు. అలాగే హుస్నాబాద్ పట్టణంలో పోలింగ్ బూత్‌ల సంఖ్య పెంచాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు కేడం లింగమూర్తి, గడిపె మల్లేష్, అయిలేని మల్లికార్జున్ రెడ్డి, ఇంద్రాల సారయ్య, రవీందర్ గౌడ్‌తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ బెన్ షాలెమ్

అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని సిద్దిపేట రూరల్ సీఐ చేరాలు, చిన్నకోడూరు ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ సూచించారు. గురువారం మండల పరిధిలోని రామునిపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్‌నేరాలు, ఈవ్‌టీజింగ్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేసుకోవడం ద్వారా భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. మానవ అక్రమ రవాణా ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు రెస్పాండ్ కావొద్దన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్న షీటీం నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజశ్రీ, ఉపాధ్యాయులు, సిద్దిపేట షీటీం బృందం కిషన్, ఏఎస్‌ఐ, మహిళా కానిస్టేబుళ్లు మమత, వీణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సార్ సెలవులో.. పిల్లలు బడిలో..

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండల పరిధిలోని దుబ్బతండా పంచాయతీ పరిధి ఆర్ఎస్ తండా ప్రాథమిక పాఠశాలలో గురువారం ఏకోపాధ్యాయుడు సెలవులో ఉండడంతో విద్యార్థులు ఆరు బయట ఆడుకున్నారు. ఏకోపాధ్యాయుడు సెలవులో ఉన్న సమయంలో కాంప్లెక్స్ పాఠశాల పరిధిలోని సీఆర్‌పీ గాని ఇతర ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాలి.. అలా చేయకపోవడంతో విద్యార్థులు ఆరు బయట ఆడుతూ బోధన లేకుండానే ఇంటికి తిరిగి వెళ్లారు. దీంతో గ్రామస్తులు విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



తరగతి గదిలో విద్యార్థులు

‘అక్రమంగా భూమిని పట్టా మార్పిడి చేశారు’

బాధిత కుటుంబీకుల ఆందోళన

కొండపాక(గజ్వేల్): కబ్జాలో ఉన్న భూమిని మరొకరికి రిజిస్ట్రేషన్ చేయడాన్ని నిరసిస్తూ బాధిత కుటుంబీకులు కుకునూరుపల్లి మండలం మంగోల్ పంచాయతీ సమీపంలోని ప్రధాన చౌరస్తా వద్ద వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మేదీనీపూర్‌కు చెందిన తాడెం యాదయ్య పేరిట మంగోల్ శివారులో కొంత పట్టా భూమి ఉంది. ఈక్రమంలో యాదయ్య సమీప బంధువులైన తాడెం సుధాకర్, సాయిలు కుటుంబీకులకు సుమారు 50 ఏళ్ల క్రితం కులపెద్దల సమక్షంలో కొంత భూమిని పంచి ఇచ్చినట్లు కాగితాలు రాసుకున్నారు. దీంతో అప్పటినుంచి ఆభూమిలో వ్యవసాయం చేసుకుంటూ కబ్జాలో ఉంటూ వస్తున్నారు. పట్టా మార్పిడి మాత్రం చేసుకోలేదు. తాడెం యాదయ్య పేరిట పట్టా ఉన్నట్లుగా రికార్డులో ఉంది. ఇదే అదనుగా భావించిన మంగోల్‌కు చెందిన ముష్టం సాయిబాబా యాదయ్య పేరిట ఉన్న 20 గుంటల భూమిని కొనుగోలు చేసినట్లు కాగితాలు తయారు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

విరాళం అందజేత

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామ శివారులోని లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయాన్ని గ్రామస్తులు దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నారు. దీంతో ఆలయ పునఃనిర్మాణ పనులు కొద్ది రోజులుగా చురుకుగా కొనసాగుతున్నాయి. ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌లో స్థిరపడిన గ్రామానికి చెందిన అల్లెంకి నాగమణి, బాలరాజ్ దంపతులు రూ. ఒక లక్ష విరాళం అందజేశారు. దీంతో దాతను ఆలయ కమిటీ తరఫున గ్రామస్తులు శాలువాతో సత్కరించి స్వామివారి ఫొటో అందజేశారు. కార్యక్రమంలో పెంటారెడ్డి, లక్ష్మీనారాయణ, పాండురంగం, అనికె రాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి



సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ రవీందర్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని జనగాం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ డీఆర్‌డీఓ రవీందర్ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీపీఎం విద్యాసాగర్, ఏపీఎం శ్రీనివాస్, సీసీ తిరుపతి, శివచరణ్, భిక్షపతి, రాజు పాల్గొన్నారు.

మంత్రి దామోదరకు అభినందనలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను గురువారం హైద్రాబాద్‌లో ఆయన క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించినట్టు టీపీసీసీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు కలీముద్దీన్ అహ్మద్ తెలిపారు.సిద్దిపేట అభివృద్ధి గురించి మంత్రి చర్చించారన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారని తెలిపారు.



మంత్రిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

గజ్వేల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమల్లోకి తేవాలని టీపీటీఎఫ్ గజ్వేల్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్ మండలంలోని వివిధ పాఠశాలల్లో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 317జీఓ బాధితులకు న్యాయం చేయాలని, 13 జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ దంపతుల బదిలీలను వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ గజ్వేల్ మండల శాఖ అధ్యక్షులు పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు, నాయకులు ధమ్మని మల్లయ్య, హఫీజ్, దయానంద్, శ్రీనివాస్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

గజ్వేల్‌రూరల్: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ సునీత పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్, తిమ్మకపల్లి గ్రామాల్లో గురువారం ఓఎస్‌సీ సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని సూచించారు. బడీడు పిల్లలను పనిలో చేర్పించవద్దని, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. ఈనెల 11 నుంచి జనవరి 11 వరకు ఓఎస్‌సీ సర్వే కొనసాగుతుందని, ఇందులో భాగంగా బడి బయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ రమేష్

సంక్షిప్త వార్తలు

◆ రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోండి

వర్గల్(గజ్వేల్): మండలంలో కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి శేషశయన సూచించారు. ఆధార్‌కార్డు, పట్టా పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ జిరాక్సులను దరఖాస్తు ఫారానికి జతచేసి ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణాధికారులకు అందజేయాలని పేర్కొన్నారు.

◆ ముస్త్యాల సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు

చేర్యాల(సిద్దిపేట): ముస్త్యాల సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్న కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ఇందుకు రైతులు సహకరించాలని ఏడీఈ రత్నాచారి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

◆ రైతులు మెలకువలు పాటించాలి

దుబ్బాక: నారుమడులలో రైతులు మెలకువలు పాటిస్తే మంచి ఫలితం ఉంటుందని దుబ్బాక మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పొలాల వద్ద నారు మడులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.

◆ మంత్రి సీతక్కను కలిసిన విశ్వకర్మలు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్కను తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణులు హైద్రాబాద్‌లో గురువారం మర్యాద పూర్వకంగా కలిసినట్లు జిల్లా అధ్యక్షుడు సాయన్నగారి శ్రీనివాస్ తెలిపారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మల సమస్యలను పరిష్కరించి, అండగా నిలవాలని కోరామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతిచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతోజు బ్రహ్మచారి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎర్రోజు రవి పాల్గొన్నారన్నారు.

◆ చీరల బహూకరణ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లి గ్రామైక్య మహిళా సంఘం అధ్యక్షులకు గురువారం సర్పంచ్ గద్దల రమేశ్ ఏకరూప చీరలను బహూకరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోశెట్టి, మాజీ సర్పంచ్ శోభారాణి, మాజీ మహిళా అధ్యక్షురాలు కొత్తకొండ విజయ, తదితరులు పాల్గొన్నారు.

◆ వైభవంగా దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ

చేర్యాల(సిద్దిపేట): పట్టణకేంద్రంలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి దంపతులు, ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీధర్, సభ్యులు బండి సుదర్శన్, ముస్త్యాల బాలనర్సయ్య, పుర్మ వెంకట్‌రెడ్డి, ఆడెపు చంద్రయ్య, యాట యాదగిరి, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



◆ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

దుబ్బాకటౌన్: దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన కొత్త ప్రభాకర్‌రెడ్డి గురువారం ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా ఆయనను దుబ్బాక జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీఆర్ఎస్ నాయకులు గుండెల్లి ఎల్లారెడ్డి, కొత్త కిషన్‌రెడ్డి, పర్స కృష్ణ, వేముల మల్లేశంగౌడ్, పడాల నరేష్, పలువురు కౌన్సిలర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

